క్లుప్తంగా

బాలికా విద్యపై అవగాహన



ప్రత్తిపాడు: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సెక్టార్ పరిధిలోని చినకోండ్రుపాడు డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా విద్య, లైంగిక దాడులపై తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి పదకొండు నుంచి పద్నాలుగు సంవత్సరాలలోపు చిన్నారులంతా కచ్చితంగా బడికి వెళ్లాలన్నారు. బాలికలపై జరిగే లైంగిక దాడులు, తీసుకోవలసిన చర్యలపై తల్లులకు వివరించారు.

ఉప్పలపాడు చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదకాకాని: చెరువులో మృతదేహం లభ్యమైన ఘటన చోటు చేసుకుంది. మండలం ఉప్పలపాడులో ప్రధానరోడ్డు పక్కనే ఉన్న చెరువులో మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని పోలీసులకు అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని చెరువులోని మృతదేహాన్ని బయటకు తీశారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన మృతుడి శవం బాగా ఉబ్బి ఉంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీ విభాగానికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణ స్వామి బుధవారం తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య
డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి



ప్రత్తిపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డీఆర్‌డీఏ పీడీ టీపీ విజయలక్ష్మి అన్నారు. వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను, స్కూల్ గ్రంథాలయం, వంటగదితో పాటు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన శౌచాలయాన్ని పరిశీలించి పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. పాఠశాలలో దాతల సహకారంతో సౌకర్యాలు సమకూర్చుతున్నామని ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్, ఆమెకు వివరించారు. దీంతో ఆమె హెచ్ఎంను అభినందించారు.

రేపు తెనాలిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పొన్నూరు: తెనాలి మండలంలోని మదర్‌థెరిస్సా నగర్, చినరావూరు తోటలో ఈ నెల 6వ తేదీన ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణం అంబేడ్కర్ నగర్‌లోని కవి డాక్టర్ కత్తి పద్మారావు కార్యాలయంలో ఆయనను కమిటీ సభ్యులు విగ్రహావిష్కరణకు ఆహ్వానించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన చలో తెనాలి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సభ్యులు మాట్లాడుతూ తెనాలిలో భారీ ర్యాలీ అనంతరం సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో అంబేడ్కర్ అభిమానులు, అభ్యుదయ వాదులు, దళిత ఉద్యమకారులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పరిశోధకురాలి ఫిర్యాదుపై విచారణకు ఆదేశం

ఏఎన్‌యూ: తనను అధ్యాపకుడు, పరిశోధకుడు వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరిశోధకురాలు దుర్గాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదుతో శాఖా పరమైన విచారణకు యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆదేశించారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పాల్ కుమార్ మంగళవారం లిఖితపూర్వకంగా కోరాడు. పరిశోధకురాలు అసత్య ఆరోపణలు చేస్తూ తన పరువుతో పాటూ యూనివర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించిందని లేఖలో పేర్కొన్నాడు. ఈ ఘటనపై యూనివర్సిటీ ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఇదిలా ఉండగా తనను ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు, పరిశోధకుడు వేధింపులకు గురి చేస్తున్నారని పరిశోధకురాలు దుర్గాలక్ష్మి గుంటూరు ఎస్పీకి చేసిన ఫిర్యాదుపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసు అధికారి టి.భీమా శంకరరావును విచారణాధికారిగా నియమించారు.

అన్నదాన ప్రభువే.. శరణం అయ్యప్పా..

- మాల ధారణ.. నియమాల ఆచరణ
- అయ్యప్ప దీక్షపై ఆసక్తి చూపుతున్న యువత

పెదకాకాని: అన్నదాన ప్రభువే.. శరణం అయ్యప్పా.. అంటూ ఆగ్రామం మార్మోగుతోంది. మండలంలోని వెనిగండ్ల శివాలయం, బ్రహ్మంగారి ఆలయంలో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ మాలలు ధరించిన భక్తులకు సద్ది(భోజనం) ఏర్పాటు చేస్తున్నారు. దాతల సహకారంతో ప్రతి ఏటా కార్తిక మాసంలో ప్రారంభించి 41 రోజుల పాటు నిర్విరామంగా ఎంతమంది మాల ధరించిన భక్తులు వచ్చినప్పటికీ అన్నసంతర్పణ చేస్తున్నారు. శివాలయంలో మాకిరెడ్డి వెంకటరెడ్డి గురుస్వామి పర్యవేక్షణలో దాతల(భక్తుల) సహకారంతో ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహిస్తున్నారు. బ్రహ్మంగారి ఆలయంలో జరిగే సద్ది ఏర్పాట్లను దాతల సహకారంతో సుబ్రహ్మణ్యస్వామి పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలోని మాలధరించిన



వెనిగండ్లలో నిర్మించిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న అయ్యప్పస్వామి

భక్తులతో పాటు పెదకాకాని, కొప్పురావూరు, అగతవరప్పాడు, ఆటోనగర్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకుని సద్ది స్వీకరిస్తూ ఉంటారు. ముందుగానే దాతలు వారికి అనుకూలమైన రోజున సద్ది ఏర్పాటు చేసేందుకు అయ్యే నగదు నిర్వాహకులకు అందజేస్తారు. ఎవరైతే సద్ది ఏర్పాటు చేస్తున్నారో వారు కుటుంబసమేతంగా ఆరోజు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. అలానే మాల ధరించిన భక్తులకు సద్ది వడ్డించే కార్యక్రమంలోనూ భాగస్వాములై భక్తిశ్రద్ధలను చాటుకుంటున్నారు. 41 రోజుల పాటు అయ్యప్ప మాల, భవానీమాల, శివమాల, శ్రీలక్ష్మీఅమ్మవారి మాల, ఆంజనేయస్వామి మాల, బ్రహ్మంగారి మాలలు ధరించిన భక్తులకు సద్ది (భోజనం) ఏర్పాట్లు విజయవంతంగా సాగడానికి అయ్యప్ప కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సహాయ సహకారాలు అందిస్తున్నారు.




వెనిగండ్ల శివాలయంలో సద్ది చేస్తున్న మాలధారులు

మాలధారణం.. నియమాల తోరణం..

శివకేశవుల తనయుడైన శ్రీమణికంఠుని మాల ధారణ నియమ నిష్టలతో కూడుకున్న ఆచరణ. కార్తిక మాసం ప్రారంభం నుంచి అయ్యప్ప దీక్షలు ప్రారంభమవుతాయి. హరిహర సుతుడైన అయ్యప్ప కేరళ రాష్ట్రంలోని శబరిమల అడవుల్లో కొలువై ఉన్నాడు. శరీరాన్ని, మనసును చెడు నుంచి మంచి మార్గంలోకి మళ్లించే దీక్షనే స్వామి శరణమయ్యప్ప మండల దీక్ష. మోక్ష మార్గాన్ని అన్వేషించేవారు, సన్మార్గాన జీవనయాత్ర సాగించాలనుకునేవారు తప్పనిసరిగా జీవితంలో ఒకసారైనా శబరిమల యాత్ర చేపట్టాలని కోరుకుంటారు. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాలను మేళవించి పచేసేది అయ్యప్పదీక్ష. స్వామి దర్శనానికి కంటే ముందు 18 మెట్లు అధిరోహించడం ద్వారా అజ్ఞానం తొలగి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షధారుల ప్రగాఢ నమ్మకం. ఏటా దీక్షాపరుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కాలంలో యువత మాలధారణ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పొన్నూరు నియోజకవర్గంలో ఏటా ఐదు వేలమందికి పైగా అయ్యప్పస్వామి మాల స్వీకరిస్తున్నారు.

బెల్ట్ షాప్ రూ.50 వేలే!!

- రెండేళ్లు అంతా మీ ఇష్టం!
- అధికారులకు మామూళ్లు మామూలే
- గుట్టు చప్పుడు కాకుండా బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు
- ఊరికి నాలుగు షాపుల చొప్పున నిర్వహణ
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గుంటూరు రూరల్: గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోంది. ప్రభుత్వం మద్యం దుకాణాలు ప్రైవేటుపరం చేసిన అనంతరం దుకాణాల యాజమాన్యం బెల్ట్ షాపులకు తెరతీశారు. మద్యం దుకాణాల్లో విక్రయాలు చేపట్టటంతోపాటు, దూరప్రాంతాలైన గ్రామాల్లో మద్యం ప్రియులకు బెల్ట్‌షాపుల ద్వారా మద్యాన్ని చేరువ చేసి మద్యం ప్రియుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మద్యం దుకాణాలను విరివిగా ఏర్పాటు చేశారు. నగరానికి కూతవేటు దూరంగా రూరల్ మండలం ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు నిభందనల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్‌కు 5 కిలో మీటర్ల దూరం పాటించాలి. నిభందనల ప్రకారం మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు 11 గ్రామాల్లో కుదరకపోవటంతో గ్రామాల్లో మద్యం ప్రియులకు వైన్ షాపులు లేకున్నా బెల్ట్ షాపుల ద్వారా మద్యంను అందించేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రామానికి నాలుగు బెల్ట్ షాపులను గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించుకునేందుకు అధికారపార్టీ నేతలు వారి వైన్ షాపుల ద్వారా మద్యాన్ని అందిస్తూనే ఉన్నారు. శివారు గ్రామాలు, శివారు కాలనీలు ప్రధానంగా బెల్ట్ షాపుల నిర్వహణలో అధికార పార్టీ నేతలు బిజీగా ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు.

బెల్ట్ షాప్ కావాలంటే రూ.50 వేలు చెల్లించాలి

వైన్ షాపులు లేని గ్రామాల్లో బెల్ట్ షాపులకు మరింత గిరాకీ పెరిగింది. బెల్ట్ షాపును నిర్వహించుకోవాలంటే సంబంధిత గ్రామాల వైన్‌షాపుల యాజమాన్యానికి రూ.50 వేలు ముందుగా చెల్లించాలి. డబ్బు చెల్లించిన వారికి మాత్రమే వైన్‌షాపు నుంచి మద్యం ఇస్తారు. వైన్ షాపులో ఎంఆర్‌పీ ధర రూ 100 ఉంటే దానిని బెల్ట్ షాపులో రూ.150కి విక్రయిస్తున్నారు. వైన్ షాపులు లేని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన నేతలు బెల్ట్ షాపుల నిర్వహణ ద్వారా పేదల కష్టాన్ని మద్యం పేరుతో దోచుకుంటున్నారని గ్రామాల్లో చర్చాంశనీయంగా మారింది.

పట్టించుకోని అధికార యంత్రాంగం

వైన్ షాపుల ద్వారా బెల్ట్ షాపులను నిర్వహిస్తూ పేదల కష్టాన్ని కొల్లగొడుతున్నా కనీసం సంబంధిత అధికారులు మాత్రం మాకేం తెలియదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని గ్రామాల్లో ప్రజలు అంటున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలే బెల్ట్ షాపులు నిర్వహిస్తూండటంతో అధికారులు మాత్రం చేసేదిలేక వారికి వచ్చే మామూళ్లతో మిన్నకుండి పోతున్నారని గ్రామాల్లో ప్రజలు ఆంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని పేదల ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్

ప్రత్తిపాడు: విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలను పునఃసమీక్షించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ కోరారు. బుధవారం ప్రత్తిపాడులోని మండల విద్యావనరుల కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు ఎంఈఓ సీహెచ్ రమాదేవికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల పని వేళల పెంపు, ఉపాధ్యాయులు పది శాతానికి మించి సెలవులు పెట్టకూడదన్న ఆంక్షలు, పది పరీక్షలకు సంసిద్ధత పేరుతో వంద రోజుల యాక్షన్ ప్లాన్, అపార్ నమోదు.. ఇలా అనేక నిర్ణయాలు అసంబద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారాలు, పండుగ రోజుల్లో పనిచేయాలంటూ బాధాకరమన్నారు. అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని, ఈ నిర్ణయాలను రద్దు చేసుకోకపోతే ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర వ్యాప్తంగా 11వ తేదీన జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ఎదుట, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు చేస్తుందని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ షకీలా బేగం, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన



ప్రత్తిపాడు ఎంఈఓ రమాదేవికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కార్యదర్శి జి.రవికుమార్, ఉపాధ్యాయులు కె.వెంకటనారాయణ, ఎస్.అంకమ్మరావు, ఐ.సదాశివ రావు, కె.ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

చేబ్రోలులో..

చేబ్రోలు: రాష్ట్రంలో విద్యాశాఖాధికారుల అసంబద్ధ నిర్ణయాలను నిరసిస్తూ యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన చేబ్రోలులో యుటీఎఫ్ నాయకులు బుధవారం ఎంఈఓ రాయల సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 11వ తేదీన గుంటూరు జిల్లా డీఈఓ ఆఫీస్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే విజయరాజు, పి.పార్థసారథి, నాయకులు కే శ్రీనివాసరావు, ఐ.శ్రీనివాస్ రెడ్డి, వై.రమేష్ బాబు, డి.నాగేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం పరిశీలన



గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని జిల్లా పంచాయతీ అధికారి బి.నాగసాయికుమార్ బుధవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వర్మికంపోస్ట్ తయారీ గురించి ఆరా తీశారు. గ్రీన్ అంబాసిడర్ల పనితీరును మెచ్చుకుని వారిని సన్మానించారు. గ్రామ సచివాలయంలో స్వర్ణపంచాయతీ కార్యక్రమం నమోదు తదితర వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కే శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి లలితకుమారి, ఉపసర్పంచి మాధవీలత, సభ్యులు వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు



కాకుమాను: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాలలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సుల నిర్వహణపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సదస్సులలో ఎల్‌ఈసీ కార్డుల మంజూరు, భూ సమస్యలు, భూ సేకరణ, సెక్షన్ 22ఏ వంటి అంశాలపై అర్జీలు స్వీకరించాలని కోరారు. ప్రతి గ్రామంలో దండోర వేయించి రైతులకు సమాచారం అందించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన వికాస కార్యవర్గం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఉద్యోగ సంఘం(వికాస) బుధవారం బాధ్యతలు స్వీకరించింది. వికాస భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ కార్యవర్గం నుంచి భాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం వీసీ కే గంగాధర రావు, రెక్టర్ కే రత్న షీలామణి , రిజిస్ట్రార్ జి.సింహాచలంను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయ్ ప్రకాష్, కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులు నేలపాటి నాగేశ్వర రావు, తోట వెంకటేష్, కోశాధికారి కె. ఝెషయా, కార్యవర్గ సభ్యులు జి. శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు ఎన్.వెంకటేశ్వర్లు, ఈ శ్రీనివాసరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు టంకశాల వెంకటేశ్వరరావు, సిహెచ్.సాంబశివరావు, చిమట ఆనంద్ పాల్గొన్నారు.

తులసీనాథ్ మృతి బాధాకరం

వైఎస్సార్ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్ సీపీకి గ్రామ సచివాలయ కన్వీనర్ అమ్మిశెట్టి తులసీనాథ్ మృతి బాధాకరమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలం వెంకటకృష్ణాపురంలో నవంబరు 24న ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలెండర్ పేలి అమ్మిశెట్టి తులసీనాథ్(37) మృతి చెందిన సంగతి విధితమే. బుధవారం తులసీనాథ్ దశదినకర్మ నిర్వహించారు. అంబటి మురళీకృష్ణ హాజరై ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు గోళ్ల జోసఫ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, పెదకాకాని శివాలయం మాజీ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పార్టీ గ్రామ కన్వీనర్ కానుగోలు శంకరరావు, తోటకూర వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, చాగంటి మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



తులసీనాథ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెదకాకాని: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అన్నారు. పెదకాకాని మండలంలోని గోళ్లమూడి, నంబూరుల్లో పొలం పిలుస్తోంది బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాగంగా పొలాల్లో ఆరబెడుతున్న ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17 ఉన్నట్లయితే 75 కిలోల బస్తా 1740 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. 17 శాతం కన్నా ఎక్కువ ఉన్నట్లయితే ప్రతి ఒక్క శాతానికి 1 కిలో ధాన్యాన్ని తరుగు కింద తీస్తారన్నారు. గరిష్టంగా 22 శాతం వరకూ తేమ ఉన్న ధాన్యం నుంచి ఐదు కిలోల ధాన్యం తరుగు కింద తగ్గించడం జరుగుతుందని చెప్పారు. గోనె సంచులు రైతుల వద్ద ఉంటే 40 కిలోల బస్తాకు 3.39 రూపాయలు, హమాలీ చార్జీలు క్వింటాకు 17.17 రూపాయల చొప్పున రైతుకు చెల్లిస్తారన్నారు. రైతు ధాన్యం ఎగుమతి చేసే ప్రాంతం నుంచి రైస్‌మిల్లుకు ఉన్న దూరాన్ని బట్టి చెల్లిస్తారన్నారు. ఈ పంట నందు నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి అయిన, ధాన్యం అమ్మడానికి సిద్ధంగా ఉన్న రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఆర్‌వీ శివాజీ, ఎస్.వెంకటశివరావు, వీఏఏలు టి.త్రివేణి, ఎం.హేమంత్, అఖిల, వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.



నంబూరు రైతులతో మాట్లాడుతున్న ఏఓ సంధ్యారాణి



:రైతులతో మాట్లాడుతున్న ఏఓ కిరణ్మయి

వల్లూరులో...

వల్లూరు(కాకుమాను): గ్రామాలలో నిర్మించిన రైతు సేవా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి పేర్కొన్నారు. మండలంలోని వల్లూరు, లింగంగుంటపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తేమ శాతాన్ని బట్టి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఫోరం ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫోరం ఫర్ అంగన్‌వాడీ యూనియన్, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు బుధవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయంలో కలసి సమస్యలను విన్నవించారు. సంక్షేమ పథకాలుకు ఆటంకంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగి అన్న నిబంధనను సీఎఫ్ఎంఎస్ నుంచి తొలగించాలని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఎలక్ట్రికల్ ఇండక్షన్ స్టవ్‌లు, పెండింగ్‌లో ఉన్న గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని విన్నవించినట్లు జ్యోతిరాణి తెలిపారు. పెండింగ్‌లో రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను 24 గంటల్లో వారి ఖాతాలకు జమ చేస్తామని డైరెక్టర్ చెప్పినట్లు వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఐ.వేమేశ్వరి, రాష్ట్ర ప్రతినిధులు విజయలక్ష్మి, పద్మకుమారి, అనిత, హెబ్సీబా పాల్గొన్నారు.



స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జ్యోతిరాణి, వేమేశ్వరి

సిమెంట్ రోడ్లకు పగుళ్లు..



పగుళ్లిచ్చి అధ్వానంగా ఉన్న పాత పొన్నూరు పార్క్ రోడ్డు



శివసాయి నగర్‌లో అధ్వానంగా ఉన్న సిమెంటు రోడ్డు

పొన్నూరు: పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంటు రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అవి కొంతకాలానికే పగుళ్లిచ్చి గుంతలమయంగా మారాయి. దీంతో రాత్రి వేళల్లో ఆ రోడ్లలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. సిమెంటు పగుళ్లిచ్చిన గుంతలతో ప్రమాదాల బారిన పడిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా పాత పొన్నూరులోని పార్కు రోడ్డు, డీవీసీ కాలనీ, ఆలూరు రోడ్డుతో పాటు పలు వీధుల్లో సమస్య తీవ్రంగా ఉన్నా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సందేశాత్మకంగా విముక్తి నాటిక

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం విముక్తి సాంఘిక నాటికను ప్రదర్శించారు. కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమి, నటరత్న ఎన్.టి.ఆర్. కళాపరిషత్ సౌజన్యంతో ఉషోదయ కళానికేతన్ 18వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించారు. సభకు రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. గంజాయి, మత్తుపదార్థాల మత్తులో ఊగిసలాడుతున్న యువతకు విముక్తి కలిగించడమే నాటక సారాంశంగా నాటికను ప్రదర్శించారు. చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించారు. ఉషోదయ కళానికేతన్ కళా రంగానికి చేస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం కళాకారులను సత్కరించారు. ఏపీ ఎస్‌టీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, రంగస్థల సినీ, నటులు వై.ఎస్.కృష్ణేశ్వరరావు, వరికూటి శివప్రసాద్, కళాసాధ అధ్యక్షుడు బిళ్ళ అశోక్, ఆరాధన ఆర్ట్స్ అధ్యక్షుడు డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, గరికపాటి వెంకటరామారావు, సయ్యద్ జానీబాషా పాల్గొన్నారు.

ఏపీజీఈఏ పేరుతో ఆగని సూర్యనారాయణ అరాచకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించినా సంఘ అధ్యక్షునిగా చెప్పుకుంటున్న సూర్యనారాయణ అరాచకాలు, దొంగ నాటకాలకు ముగింపు పలకాలని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన క్యాదర్శులు పి.పవన్‌కుమార్, పి.అమ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు షేక్ మొహబూబ్ బాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగిగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లే విధంగా అవినీతికి పాల్పడడంతో గత ప్రభుత్వం ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకున్న కారణంగా సంఘ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఆయనపై నమోదు చేసిన కోట్లాది రూపాయల కుంభకోణానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ ప్రస్తుత ప్రభుత్వం తొలగించినట్లు చెప్పుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. వాణిజ్య పన్నుల శాఖలో చేసిన వ్యవహారాన్ని సంఘానికి అంటగడుతూ నష్టం కలిగించడం మినహా, సంఘ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. ఏపీజీఈఏ పేరుతో ఈనెల 14న రాజమండ్రిలో సమావేశం అంటూ ఉద్యోగులను తప్పుదోవపట్టిస్తున్న బహిష్కృత అధ్యక్షుడు సూర్యనారాయణ మాటలు నమ్మిమోసపోవద్దని ఉద్యోగులకు సూచించారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సాయం అభినందనీయం

కొండపాటూరు(కాకుమాను): పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పాఠశాల పూర్వవిద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ తల్లి దండ్రులు జాష్టి ఈశ్వరమ్మ ,రామయ్యల జ్ఞాపకార్థం కుమార్తెలు బుధవారం రూ.2.5 లక్షలతో విద్యార్థుల సౌకర్యార్థం ఐఎఫ్‌పీసీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్), యార్లగడ్డ అంకమ్మ చౌదరి, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.1.5 లక్షలతో పాఠశాల మరమ్మతులు చేయించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ విద్యార్థులకు అత్యాధునిక విద్యను అందించాలనే లక్ష్యంతో పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. పూర్వ విద్యార్థి యార్లగడ్డ అంకమ్మ చౌదరి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల కావల్సిన అన్ని వసతులను కల్పించేందుకు పాఠశాల పూర్వ విద్యార్థులు ఎప్పుడు అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.విజయ్ భాస్కర్, పూర్వ విద్యార్థులు లీలా కుమారి, ప్రసాద్, హెచ్ఎం శీలం అంకారావు, మండల లక్ష్మీనారాయణ, రాఘవరావు, రామారావు, సత్యం ఉన్నారు.